సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 14 । డిసెంబర్ । 2024



కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి.శుక్రవారం జి మాడుగులలో 8.8, పెదబయలులో 12.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నట్లు తెలిపారు. పాడేరు డివిజన్ పరిధి ముంచంగిపుట్టులో 12.4 డుంబ్రిగుడ, అనంతగిరి, జీకే వీధిలో 12.9, పాడేరులో 13.2, హుకుంపేటలో 13.5, చింతపల్లిలో 13.9, కొయ్యూరులో 16.5 డిగ్రీలు నమోదు అయినట్టు ఏడీఆర్ వెల్లడించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

- విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జీఎన్ ప్రసాద్

పాడేరు రూరల్ (అరకులోయ రూరల్): జిల్లా వ్యాప్తంగా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈనెల 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జీఎన్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, మహిళా బృందాలకు ముగ్గుల పోటీలు ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. విద్యుత్ పొదుపు అవశ్యకత- నూతన సాంకేతిక విజ్ఞానంపై ఇంజినీరింగ్ కళాశాలల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. విద్యుత్ వినియోగంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఆయన కోరారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఈనెల 20న బహుమతులు అందజేస్తామని ఎస్‌ఈ తెలిపారు.

రోడ్డెక్కిన గురుకుల విద్యార్థులు

- ఔట్‌సోర్సింగ్ టీచర్లు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కొయ్యూరులో బైఠాయించి ఆందోళన చేస్తున్న గురుకుల విద్యార్థులు

కొయ్యూరు: రోజుల తరబడి ఆందోళన చేస్తున్న గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కొయ్యూరు గురుకుల పాఠశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఆందోళన నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పాఠశాల గేటు ఎదుట బైఠాయించిన నినాదాలు చేశారు. సుమారు 28 రోజుల నుంచి ఉపాధ్యాయులు లేక తరగతులు నిర్వహించడం లేదన్నారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల ఉపాధ్యాయుల ఆందోళనపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని

కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఆశ్రమాల పర్యవేక్షణ

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



ఐటీడీఏ వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : ఐటీడీఏలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను నిత్యం పర్యవేక్షించాలని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన కమాండ్‌కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి విద్యార్థుల స్టడీ అవర్, వారికి వడ్డిస్తున్న భోజనం, ఇతర అంశాలను పరిశీలించాలని టీడబ్ల్యూ ఇన్‌చార్జిని డీడీ రజనీని ఆదేశించారు.

మీకోసంలో 57 వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, డీఆర్వో పద్మలత

పాడేరు : సమస్యలపై ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతులను నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఏజెన్సీ 11 మండలాల పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి పలు సమస్యలపై 57 అర్జీలను డీఆర్వో పద్మాలతతో కలిసి స్వీకరించారు. పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, కమ్యూనిటీ భవనాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, పక్కా రోడ్లు, పాఠశాల భవనం మంజూరు చేయాలని వినతులు అందాయని వారు పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్‌రావు, ఐటీడీఏ ఏవో హేమలత, ఎల్‌డీఎం మాతునాయుడు, డీఎస్‌డీవో రోహిణి పాల్గొన్నారు.

రైతులను మోసం చేసింది



ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. అన్నదాత సుఖీభవ పథకంలో ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని నమ్మించి మోసం చేసింది. కూటమి ప్రభుత్వానికి పాలించే హక్కు లేదు.
–వంతల రమణ, రైతు, జి.మాడుగుల మండలం

గత ప్రభుత్వంలో సాఫీగా సాగు



అధికారం చేపట్టి ఆరు నెలలు అయింది. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏఒక్క దానిని అమలు చేయలేదు. సాగు చేపట్టేందుకు అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వచ్చింది. గత ప్రభుత్వంలో వ్యవసాయం సాఫీగా సాగింది. – కొర్రా లక్ష్మయ్య, గిరిజన రైతు, చింతపల్లి

ప్రజావిశ్వాసం కోల్పోయింది



రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజావిశ్వాసాన్ని కోల్పోయింది. అధికారం చేపట్టిన తరువాత ఏఒక్క ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టలేదు. ధాన్యానికి మద్దతు ధర ప్రకటించక పోవడంతో నష్టపోతున్నాం. – ఎ.సత్తిబాబు, రైతు, అరడపల్లి

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన



గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ పరికరాలతోపాటు అన్ని రకాల విత్తనాలను సబ్సిడీపై అందించింది. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోంది.
– కె. గౌరీశంకర్, రైతు, ముంచంగిపుట్టు మండలం

ఒక్కటై కదిలి.. గొంతులన్నీ ఏకమై..

- ఉప్పెనలా తరలివచ్చిన జనం
- కూటమి ప్రభుత్వం తీరుపై నిరసన గళం
- అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి విశేష స్పందన
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, ధర్నా
- ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్
- ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామని హెచ్చరిక
- డీఆర్వో పద్మలతకు వినతిపత్రం అందజేత



పాడేరులో నిర్వహించిన ర్యాలీలో రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



డీఆర్వో పద్మలతకు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

ఎన్నికల హామీలను అమలుచేయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వానికి ప్రజలనుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. శుక్రవారం వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు అన్నివర్గాల ప్రజలు జిల్లా కేంద్రం పాడేరులో చేపట్టిన నిరసన కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలనపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు.

గిరిజనాగ్రహం

డిమాండ్లు ఇవే..

- తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20వేలు ఇవ్వాలి
- సూపర్ సిక్స్ హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలుజేయాలి
- ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలి
- దళారీ వ్యవస్థను తొలగించాలి
- తడిసిన రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలి
- ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలి
- రైతుపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలి

సాక్షి,పాడేరు/పాడేరు/పాడేరు రూరల్: ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వంపై జనాగ్రహం పెల్లుబికింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి నిరసన తెలిపారు. దీనిలో భాగంగా పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు క్యాంపు కార్యాలయం నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు చేపట్టిన నిరసన ర్యాలీని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి ప్రారంభించారు. అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ సాగింది. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఎన్నికల హామీలను తక్షణం అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలువురు నేతలు మాట్లాడారు. అనంతరం డీఆర్వో పద్మలతకు పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు.

రైతులు అప్పులపాలు : ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కూటమి ప్రభుత్వంలో భరోసా కరువవడంతో రైతులు అప్పులపాలయ్యారని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర విమర్శించారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు



పాడేరులో నిర్వహించిన ర్యాలీలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, రైతులు, అన్నివర్గాల ప్రజలు

అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తానని చెప్పిన చంద్రబాబు రైతుకు కనీసం రూ.20 కూడా ఇవ్వలేదన్నారు. రైతులంతా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగుకు పెట్టుబడి పెట్టారన్నారు. రైతుని అప్పులుపాలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ధ్వజమెత్తారు. ప్రజల తరఫున తమ పార్టీ పోరాడుతుందని హెచ్చరించారు.

రైతాంగానికి తీరని అన్యాయం: అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సంతోషంగా ఉన్న రైతాంగానికి కూటమి ప్రభుత్వం మాత్రం తీవ్ర అన్యాయం చేస్తోందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేశారన్నారు. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తామన్న కూటమి ప్రభుత్వం అమలుచేయకపోవడం అన్యాయమన్నారు. వైఎస్సార్‌రైతు బీమా పథకాన్ని కూడా రద్దు చేయడంతో రైతులకు తీవ్ర నష్టం ఏర్పడిందన్నారు. కూటమి పాలనలో గిరిజన రైతులకు ఆర్థిక భరోసా లేకుండా పోయిందన్నారు.

హామీలు అమలు చేయాల్సిందే: ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే అమలుజేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 54 లక్షల మంది రైతులను కూటమి ప్రభుత్వం దగా చేసిందన్నారు. ఇటీవల అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన గిరిజన రైతులకు నష్ట పరిహారం చెల్లించడంలోను అన్యాయం చేసిందన్నారు. రాక్షస పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎన్నికల హామీలను అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతులకు అండగా పోరాటం: మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని ఆమె పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో 1.80 లక్షల మంది మంది గిరిజన రైతులకు రైతు భరోసా పథకం కింద ఏడాదికి రూ.13,500 పంపిణీ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని ఎగ్గొట్టిందన్నారు. పిల్లలందరికీ అమ్మకు వందనం పేరిట సాయం చేస్తామని చంద్రబాబు మోసం చేయడం దుర్మార్గమన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చండి: మాజీ ఎంపీ మాధవి

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి పెద్దలు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి డిమాండ్ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలతో పాటు రైతు సంక్షేమ కార్యక్రమాలన్నింటిని అమలుజేసే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు.అవన్ని అమలయ్యేవరకు ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

◆ ఈ కార్యక్రమంలో ఎంపీపీలు బడుగు రమేష్,బోయిన కుమారి, అనూషదేవి, ఉషారాణి,ఈశ్వరమ్మ, సీతమ్మ, శెట్టి నీలవేణి, జెడ్పీటీసీలు వారా నూకరాజు, పోతురాజు బాలయ్య, కూడా బొంజుబాబు, చటారి జానకమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శులు కూడా సురేష్‌కుమార్, కిల్లు కోటిబాబునాయుడు, జల్లి సుధాకర్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింగరావు, సీనియర్ నాయకులు శోభా సోమేశ్వరి, జగబంధు, శెట్టి అప్పాలు, కిమ్మిడి అశోక్, దురియా ఆనంద్‌కుమార్, విజయ్‌కుమార్, పాంగి చిన్నారావు, మత్స్యకొండనాయుడు, సీదరి రాంబాబు, హనోక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,రైతులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ లోపల ఆందోళన చేస్తున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మీడియాపై దాడులు సరికావు

- వైఎస్సార్ కడప జిల్లాలో సాక్షి మీడియాపై కూటమి నేతల దాడులు
- ఖండించిన మీడియా ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాలు



విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మీడియా ప్రతినిధులు

సీతమ్మధార (విశాఖ) : సాక్షి మీడియా ప్రతినిధులపై జరిగిన దాడిని వివిధ జర్నలిస్టు సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ కడప జిల్లా వేములలో నీటిసంఘాల ఎన్నికల ప్రక్రియ కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టీవీ కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిలపై రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని సాక్షి దినపత్రిక ప్రతినిధులు,పలు సంఘాల నాయకులు ఖండించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. జర్నలిస్టులు, మీడియా గొంతు నొక్కాలని అధికార పార్టీ నేతలు చూస్తున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని తీవ్రంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ పి.వేణు గోపాల్ మాట్లాడుతూ సాక్షి ప్రతినిధులపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి దాడులు మళ్లీ జరిగితే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా సహాయ కార్యదర్శి కేటీ రామునాయుడు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకతను తెలియపరిస్తే కూటమి ప్రభుత్వం సహించలేకపోతోందని మండిపడ్డారు. సాక్షి డెస్క్ ఇన్‌చార్జి బీబీ సాగర్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు సమాజానికి మంచివికావన్నారు. ప్రజల పక్షాన నిలిచే మీడియా గొంతునొక్కాలన్న ప్రభుత్వ విధానాలను అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. వైజాగ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ కార్యదర్శి నవాజ్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి చేయడం ద్వారా మీడియా గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిని తీవ్రంగా శిక్షించాలి భీమిలి ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ రమణ ప్రసాద్ డిమాండ్ చేశారు. విశాఖ సాక్షి బ్యూరో చీఫ్ కేజీ రాఘవేంద్రరెడ్డి, స్టాఫ్ రిపోర్టర్లు, డెస్క్ సభ్యులు, విలేకరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, జాయింట్‌కలెక్టర్ అభిషేక్ గౌడ

జి.మాడుగుల: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, జాయింట్‌కలెక్టర్ అభిషేక్ గౌడ కోరారు. మండలంలో పాలమామిడిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు వచ్చేనెల 10వరకు జరుగుతాయన్నారు. వీటిలో భూ వివాదాలు, భూ సమస్యలు, మ్యూటేషన్లు, భూముల సరిహద్దు సమస్యలపై పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ, తహసీల్దార్, ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ తిరగకుండా రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్, తహసీల్దార్ పి. లత్సాపాత్రుడు, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

భూసమస్యలు త్వరితగతిన పరిష్కారం

అరకులోయ టౌన్: గిరి గ్రామాల్లో రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ అన్నారు. శుక్రవారం శిరగాం పంచాయతీ కోడిపుంజువలస, కప్పలగొందిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. వినతులను పక్కాగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించిన ఆరు రిజిస్టర్లను పరిశీలించారు.



పాలపామిడిలో వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, జేసీ అభిషేక్ గౌడ



పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్

బాల్యవివాహాల నివారణకు కృషి

- మహిళ స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ చిన్మయిదేవి



సదస్సులో మాట్లాడుతున్న ఆర్జేడీ చిన్మయిదేవి

ఎటపాక: బాల్యవివాహాల నియంత్రణకు గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరు కృషి చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మహిళ స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ చిన్మయిదేవి తెలిపారు. శుక్రవారం ఎటపాకలో నిర్వహించిన కిశోరి వికాసం బాల్య భవిష్యత్ సదస్సులో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషోర బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. బాలికల భవిష్యత్ మెరుగుపరచుకునేందుకు కిషోరి వికాసం మంచి అవకాశమన్నారు. 11 నుంచి 18 సంవత్సరాల బాలికలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన మెరుగుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో, మాదకద్రవ్యాలు నియంత్రణ, విద్య, ఆరోగ్యం, చట్టాలపై అవగాహన పొందాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవో విజయగౌరి, సీఐ కన్నపరాజు, ఎస్ఐ పార్థసారధి, సూపర్‌వైజర్లు రాధమ్మ, నాగలక్ష్మి, ఎంఈవో లక్ష్మీనారాయణ, డాక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు.

పసికందు మృతిపై విచారణ

11లో



విచారణ చేస్తున్న ఐసీడీఎస్ పీవో రమణి

కలెక్టర్ చొరవతో పాఠశాలకు భవన వసతి

- రూ.8 లక్షలు మంజూరుచేసిన దినేష్‌కుమార్
- దిగువకుమడలో చురుగ్గా నిర్మాణ పనులు

సాక్షి ఎఫెక్ట్..



దిగువకుమడలో పాఠశాల భవన నిర్మాణం

ముంచంగిపుట్టు: మండలంలోని కుమడ పంచాయితీ దిగువకుమడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. భవన వసతి లేని ఈ పాఠశాలను గత జూలై 3వ తేదీన కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. అయినప్పటికీ సమస్య తీరలేదని, షెడ్డులోనే పాఠాలు– ఇంకెన్నాళ్లీ పాట్లు శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. సుమారు రూ.8 లక్షలు మంజూరు చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఈఈ వేణుగోపాల్ పర్యవేక్షణలో భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెలాఖరునాటికి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ అధికార వర్గాలు తెలిపాయి. కలెక్టర్ దినేష్‌కుమార్ చొరవతో భవన వసతి అందుబాటులోకి రానుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎం మహాసభలు జయప్రదం చేయండి



మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కిరణ్

రాజవొమ్మంగి: రంపచోడవరంలో ఈ నెల 16, 17 తేదీలలో తలపెట్టిన జిల్లా సీపీఎం మొదటి మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ పిలుపునిచ్చింది. శుక్రవారం రాజవొమ్మంగి మండలంలోని దుర్గనగరం గ్రామంలో మండల కమిటీ సభ్యులు రామరాజు, సత్యనారాయణ, రమణల అధ్యక్షతన 6వ మండల మహాసభ జరిగింది. జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఆర్నెల్ల కాలంలోనే రూ. 634 వేల కోట్ల అక్రమ దందా వ్యాపారం జరిగిందని దుయ్యబట్టారు. రూ. 9.8 కోట్ల మేర విద్యుత్ బిల్లులు పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. రూ. 27 వేల కోట్ల మేర కరెంటు చార్జీలు పెంచి సామాన్యుని నడ్డి విరిచిందన్నారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలపై మాట్లాడే వారు లేరన్నారు. అరకులో చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో జీవో నంబరు 3 అమలు చేసి ప్రత్యేక డీఎస్సీని అమలు పరుస్తానని హామీ ఇచ్చి, ఇప్పుడు నోరు మెదపడం లేదని విమర్శించారు. కొమరంభీమ్, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో మన్యంలో మన హక్కుల కోసం పోరాడుదాం అని పిలుపునిచ్చారు. ఢిల్లీలో డబుల్ ఇంజన్ సర్కార్ బీజేపీ బుల్డోజర్ రాజకీయాలను సీపీఎం జాతీయ నాయకురాలు బృందాకారత్ అడ్డుకుందన్నారు. దీనితో ఎర్ర జెండా సత్తా ఏంటో ఢిల్లీలోనే బట్టబయలు అయ్యిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు ప్రధాని మోదీని ప్రశ్నించేందుకు భయపడుతున్నారన్నారు. ఏపీలోని ఏ అంటే అమరావతి, పీ అంటే పోలవరం సమస్యలు పరిష్కరిస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించి నేడు కిమ్మనకుండా ఉందని విమర్శించారు. సూరిబాబు, అచ్చారావు, జగన్నాథం, అప్పలరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

తాటిపర్తి ఆశ్రమ విద్యార్థిని మృతి

- వార్డెన్, హెచ్‌ఎంల నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రుల ఆరోపణ
- ఆరోగ్యం బాగోలేదని ముందుగా సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం
- పాఠశాల ఎదుట బంధువులతో కలసి ఆందోళన



తాటిపర్తి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు, సీపీఎం నాయకుడు నరసింహమూర్తి

మాడుగుల: తాటిపర్తి గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని అనారోగ్యంతో చోడవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. తమ కుమార్తె అనారోగ్యం విషయాన్ని ముందుగా తెలియజేయలేదని, ఆమె మృతికి వార్డెన్, హెచ్‌ఎం కారణమంటూ బంధువులతో కలిసి బాధిత తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో డీఎస్పీ శ్రావణి, ఐటీడీఏ డీడీ ఎల్.రజని, తహసీల్దార్ రమాదేవి, స్థానిక పోలీసులు రంగంలోకి దిగి వివాదం సద్దుమణిగేలా చేశారు. బాధిత తల్లిదండ్రులు పెంటన్నదొర, సన్యాసమ్మ, బంధువుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అయినాడ పంచాయతీ చీమలాపల్లి గ్రామానికి చెందిన ముర్ల సత్యవతి(14) మాడుగుల మండలం తాటిపర్తి గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆమెకు ఆరోగ్యం బాగా లేదని గురువారం ఉదయం హాస్టల్ నుంచి ఫోన్ వచ్చిందని తండ్రి దొర తెలిపారు. వెంటనే ఆయన హాస్టల్‌కు వెళ్లి సత్యవతితో మాట్లాడగా కాలు నొప్పి ఎక్కువగా ఉందని చెప్పడంతో చోడవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సత్యవతి మృతి చెందింది. తమ కుమార్తె అనారోగ్యం విషయాన్ని వార్డెన్ మహేశ్వరి, హెచ్‌ఎం ఎస్.రమాదేవి ముందుగా సమాచారం ఇవ్వకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తల్లిదండ్రులు ఆరోపించారు. అనంతరం సీపీఎం నాయకులు ఇరటా నరసింహమూర్తి, కార్లి భవాని, బాధిత తల్లిదండ్రులు, బంధువులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాఠశాల ఎదుట సత్యవతి మృతదేహంతో ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, ఐటీడీఏ డీడీ ఎల్.రజని, చోడవరం ఇన్‌చార్జి సీఐ కె.అప్పలరాజు, స్థానిక తహశీల్దార్ రమాదేవి, ఎంఈవో బి.దేముడమ్మ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. విద్యార్థిని మృతిపై సమగ్ర దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఈ విషయమై, హెచ్‌ఎం రమాదేవి, వార్డెన్ మహేశ్వరిని సంప్రదించగా.. సత్యవతి పాఠశాలలో చాలా చురుకుగా ఉండేదని, బుధవారం తెలుగు పరీక్ష కూడా రాసిందని, గురువారం కాలు నొప్పిగా ఉందని తమకు చెందన్నారు. వెంటనే సచివాలయం ఏఎన్‌ఎం దగ్గరికి పంపించగా.. అక్కడ నొప్పికి సంబంధించిన ఇంజక్షన్ వేశారని, కొద్దిగా నొప్పి తగ్గడంతో వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. బాగా చదువుతున్న విద్యార్థిని మృతి చెందడం తమకు కూడా బాధగా ఉందని, ఆమె ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని వారు స్పష్టం చేశారు.



సత్యవతి మృతదేహం

కాకినాడ కలెక్టరేట్ ముట్టడి విజయవంతం



కాకినాడ కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్న ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

అడ్డతీగల: రైతుల సమస్యలపై శుక్రవారం చేపట్టిన కాకినాడ కలెక్టరేట్ ముట్టడికి రంపచోడవరం ఏజెన్సీలోని 11 మండలాల ప్రజాప్రతినిధులు తరలివచ్చారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంతబాబు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. అన్నదాతకు అండగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజలు భాగస్వాములై కూటమి ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను చాటారన్నారు. పార్టీ శ్రేణులు వివిధ వర్గాల ప్రజలతో పాటు ర్యాలీగా బయలుదేరి వెళ్లి కలెక్టరేట్ ముట్టడి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామని వారు పేర్కొన్నారు.

చౌడుపల్లి,సాకులపాలెంలో తాగునీటి పథకాలు ప్రారంభం

కొయ్యూరు: నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో చౌడుపల్లి,సాకులపాలెంలలో నిర్మించిన రక్షిత తాగునీటి పథకాలను బూదరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్ శుక్రవారం ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కరుణ,జేఈ సాయి కృష్ణ, నవ నిర్మాణ సమితి ప్రాజెక్ట్ మేనేజర్ సన్యాసిరావు, మేనేజర్ రవి కుమార్,స్థానిక ఎంపీటీసీ కుమారి,వైఎస్సార్ సీపీ నేత వంతల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువత క్రీడల్లోనూ రాణించాలి



బొయితిలిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పాడేరు డీఎస్పీ ప్రమోద్



వాలీబాల్ విజేత చింతగొప్ప టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న పాడేరు డీఎస్పీ ప్రమోద్

- పాడేరు డీఎస్పీ ప్రమోద్

జి.మాడుగుల: గిరిజన యువత చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాల జోలికి పోకుండా క్రీడాస్ఫూర్తితో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పాడేరు డీఎస్పీ కె. ప్రమోద్ తెలిపారు. మండలంలో బొయితిలి పంచాయతీ కేంద్రంలో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్, మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ గిరిజన ప్రాంతాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన యువత క్రీడల పట్ల దృష్టి సారించాలన్నారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో 35 టీమ్‌లు పాల్గొనగా మొదటి బహుమతి చింతగొప్ప, ద్వితీయ బహుమతి మడతకొండ గ్రామం, మూడో బహుమతి బొయితిలి గెలుపొందాయి. ఆయా టీమ్‌ల విజేతలకు డీఎస్పీ షీల్డులు ట్రోఫీలతో పాటు టీషర్టులు, వాలీబాల్ కిట్లు అందజేశారు. వైద్య శిబిరంలో 278 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాలీబాల్ క్రీడాకారులకు, వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలందరికీ భోజన సదుపాయ కల్పించారు. కార్యక్రమంలో సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ అప్పలరాజు, సర్పంచ్ మాలన్న, మాజీ సర్పంచ్ రాంబాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం

- ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్

చింతూరు: గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా అన్నారు. జమాల్‌ఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చింతూరులో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు గెలవాలనే లక్ష్యంతో పోటీల్లో పాల్గొనాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా టోర్నమెంట్ నిర్వహించాలని సూచించారు. ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు ఈ క్రీడలను నిర్వహిస్తున్నామని, యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు చెందిన 72 జట్లు ఈ టోర్నమెంట్లో పాల్గొంటున్నాయని, విజేతలకు రూ. 50 వేలు, రన్నరప్‌కు రూ.30 వేల నగదు బహుమతి అందచేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ రమేష్, నాయకులు పాయం వెంకయ్య, రమణారెడ్డి, మడివి రాజు, జల్లి నరేష్ పాల్గొన్నారు.

పోషక విలువలున్న ఆహారం అందించాలి

- కేవీకే కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్



కూరగాయ విత్తనాల కిట్లను పంపిణీ చేస్తున్న కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్

రంపచోడవరం: అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో పోషక విలువలు ఉన్న కూరగాయలు, ఇతర పంటల సాగు చేపట్టి మాతాశిశువులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ సూచించారు. పోషకాహార పంటల సాగుపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర సిబ్బందికి శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతుల పంటల సాగుపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అనంతరం కూరగాయలు, అలసంద, దుంపకూరలు, ఆకుకూరలు తదితర 12 రకాల విత్తనాల కిట్‌లను అంగన్‌వాడీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ ప్రవీణ్‌బాబు, డాక్టర్ వీరాంజనేయులు, ఐసీడీఎస్ అధికారి సంధ్యారాణి పాల్గొన్నారు.

ట్రైకార్‌తో ఉపాధి అవకాశాలు

- చైర్మన్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసరావు

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన యువతీ,యువకులకు ట్రైకార్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో వివిధ శాఖల సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ మందికి రాయితీపై వాహనాలు మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. మెగా డీఎస్సీతో పాటు చదువుకున్న యువతీయువకులకు స్వయం ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. తేనె పరిశ్రమలతో పాటు వివిధ ప్రాసెస్ యూనిట్ల ఏర్పాటుకు యువతను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఐటీడీఏ పీవో కె.సింహాచలం, ఎమ్మెల్యే శిరీషాదేవి, ఎస్‌డీసీ జాన్ రాజ్, గిరిజన సంక్షేమ డీడీ విజయశాంతి పాల్గొన్నారు.

గ్రామాల్లో మంచినీటి సమస్య తీరుస్తాం



కొంతిలిలో బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

హుకుంపేట: గ్రామాల్లో మంచినీరు సమస్య తీర్చేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పేర్కొన్నారు. మండలంలోని కొంతిలి పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించారు. జిల్లా పరిషత్ నిధులు రూ.1.50 లక్షలతో మంచినీరు పథకం, బోర్ ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మంచినీరు సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడ సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగం రమేష్, మాజీ సర్పంచ్ పార్వతమ్మ, వార్డు సభ్యులు కాసులమ్మ, కృష్ణవేణి, నాయకులు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు: మండలంలో జోలాపుట్టు పంచాయతీ బొండ్రుగూడ గ్రామంలో సర్పంచ్ నీలకంఠం, ఎంపీటీసీ సభ్యురాలు కమల శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. సర్పంచ్ నీలకంఠం మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో 110 మీటర్ల మేర సీసీరోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో నూతనంగా నిర్మించిన రామాలయానికి వెళ్లే మార్గం వర్షం పడితే బురదగా మారి నడవలేని పరిస్థితి ఉండేదన్నారు. ఈ సమస్యను జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకెళ్లామని, ఆమె స్పందించి సీసీరోడ్డుకు జెడ్పీ నిధులు మంజూరు చేశారన్నారు. ఆమెకు గ్రామ గిరిజనులు తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు

జి.మాడుగుల: పీఎం జన్మన్ పథకం కింద మంజూరైన గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ బాబునాయక్ ఆదేశించారు. మండలంలో జంగిల్‌మెట్ట గ్రామంలో గృహ నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి బిల్లులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పసికందు మృతిపై విచారణ

చింతపల్లి: మండలంలో మూడు నెలల పసికందు మృతిపై ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. కొత్తపాలెం పంచాయతీ పరిధి మామిడిపల్లి గ్రామానికి చెందిన మూడు నెలలు శిశువు శ్వాస ఆడక మృతి చెందినట్లు పత్రికల్లో వచ్చిన కథనాలపై వారు స్పందించారు. దీనిలో భాగంగా సర్పంచ్ వనగల సోమరత్నంతో ఐసీడీఎస్ పీవో జీవీ రమణి గ్రామాన్ని సందర్శించారు. చిన్నారి మృతికి సంబంధించిన వివరాలను శిశువు తల్లి వంజరి ఈశ్వరి తండ్రి గణపతి నుంచి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. శిశువుకు ఉదయం వ్యాక్సిన్ వేయగా, సాయంత్రం జ్వరం వచ్చిందన్నారు. గాలి తగిలిందని దిష్టి తీసి సంప్రదాయ వైద్యం చేశారన్నారు. దాంతో తీవ్ర అవస్వస్థతకు గురై మృతి చెందినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. శిశువు మృతికి సంబంధించి కారణాలు వైద్యాధికారి విచారణలో తెలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

నేడు శిక్షణకు ఎంపిక



సీడ్ ట్రైనర్ రత్నకుమార్

రాజవొమ్మంగి: రిటైల్ మార్ట్‌లలో పని చేసేందుకు ఆసక్తి చూపే వారికి శిక్షణ ఇచ్చేందుకు శనివారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడ్ ఏపీ ట్రైనర్ కె.రత్నకుమార్ తెలిపారు. ఉపాధి హామీ శ్రమశక్తి సంఘాల్లోని వేతనదారుల పిల్లలు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి నాలుగు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన వారు, విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, కులధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్‌కార్డు వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

ఏకగ్రీవంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ సభ్యులతో జిల్లా నేతలు

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌శ్రీను ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నేతలు త్రినాథ్,రాందాసుల పర్యవేక్షణలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండల కమిటీ అధ్యక్షుడిగా పూరిస్తాన్, కార్యదర్శిగా పవన్, ఉపాధ్యక్షుడిగా అతిరామ్,సహాయ కార్యదర్శిగా రాజులమ్మ, సభ్యులుగా 20 మంది ఎన్నికయ్యారు.

కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన జేసీ, ఐటీడీఏ పీవో



కొత్తపల్లి జలపాతం ఫ్యూయింట్ వద్ద పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, జేసీ అభిషేక్‌గౌడ్

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సందర్శించారు. జలపాతం వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను వారు పరిశీలించి, వేగవంతం చేయాలని ఆదేశించారు. జలపాతం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వ్యూపాయింట్ నుంచి ప్రకృతి అందాలను వీక్షించారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు



పాడేరు కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

డుంబ్రిగుడ: రైతుల సమస్యలపై శుక్రవారం నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడికి డుంబ్రిగుడ మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు భారీగా తరలివెళ్లారు. సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు, కండ్రుమ్ సర్పంచ్ కె.హరి, పోతంగి సర్పంచ్ వి.వెంకటరావు, కొల్లాపుట్టు సర్పంచ్ రామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ బలరామ్, తూమ్‌నాథ్ తదితరులు తరలి వెళ్లారు. అంతకముందు జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీపీ ఈశ్వరి, మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో కలిసి పాడేరు వెళ్లారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు



రగ్గులు పంపిణీ చేస్తున్న హుకుంపేట మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్,పాస్టర్లు

ముంచంగిపుట్టు: ప్రేమ మార్గం ప్రభువు సందేశమని ఇమ్మానుయేలు పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ అన్నారు.మండల కేంద్రంలో శుక్రవారం ముంచంగిపుట్టు ఇమ్మానుయేల్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హౌళీ మైదానంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.పాస్టర్‌లు మోహన్, ప్రసాద్, బర్నబాస్‌లు ఆరాధన క్రిస్మస్ సందేశాన్ని అందించి,ఐక్య క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి,క్రైస్తవ భక్తి గీతాలు ఆలపించారు.అనంతరం విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో హుకుంపేట మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్ పాల్గొని రెండు వందల మంది పేదలు, వృద్ధులకు ఉచితంగా రగ్గులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పెదబయలు ఎంఈవో పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండోరోజు శిక్షణ



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండో రోజు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. సామర్ల కోటకు చెందిన ఈటీసీ ఫ్యాకల్టీ సభ్యులు శ్రీనివాస్, ప్రసాద్‌లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల దీక్షకు బీఎస్పీ మద్దతు



దీక్షలో నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని పాడేరు జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం 28 రోజు కొనసాగింది. బీఎస్పీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి సుర్ల అప్పారావు దీక్షకు మద్దతు తెలిపారు. దీక్ష శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు.

అనారోగ్యంతో బూసిపుట్టు వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

ముంచంగిపుట్టు: మండలంలోని బూసిపుట్టు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గెమ్మెలి మోహిని(32) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. మోహిని జ్వరంతో బాధపడుతుండంతో కుటుంబ సభ్యులు మూడు రోజుల కిందట విశాఖ కేజీహెచ్‌లో జాయిన్ చేశారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందారు.